
ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024





నూతన ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణికి మండలంలో గల సచివాలయాల ఉద్యోగులు ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సంధ్యారాణి ఇంటికి వెళ్లి పూలబొకేలు ఇచ్చి వారు అభినందించారు.
-ప్రజాశక్తి - సాలూరు రూరల్





గుమ్మడి, కొండపల్లికి మంత్రి ఛాన్స్..!

సామాజిక కోణంలో సాగుతున్న చర్చ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/బొబ్బిలి

సాలూరు ఎమ్మెల్యే గుమ్మడి సంధ్యారాణి, గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడుకు రాష్ట్రమంత్రి వర్గంలో చోటు లభించనుందా? అన్న ఊహాగానాలు జిల్లాలో వ్యక్తమౌతున్నాయి. లేదంటే కొండపల్లికి బదులు చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావుకు ఛాన్సు ఉందని చర్చ సాగుతోంది. ఈసారి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే మంత్రి పదవులు కేటాయింపు ఉంటాయన్న సంకేతాలు వెలువడుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులు ఖాయమని పలువురు విశ్లేషిస్తున్నారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులుగా ఉన్న సంధ్యారాణి సుదీర్ఘకాలంగా ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. దీనికితోడు మిగిలిన గిరిజన ఎమ్మెల్యేలతో పోలిస్తే సీనియర్ అని చెప్పుకోవచ్చు. పేరుకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన మంత్రి పదవులు ఉంటాయని చెప్తున్నప్పటికీ మన్యం ప్రాంతానికి ఒక మంత్రి పదవి కేటాయించే అవకాశం లేకపోలేదు. ఈ లెక్కన సంధ్యారాణి తప్పక మంత్రి అవుతారనే ఆశాభావం ఆమె అనుయాయులు వ్యక్తం చేస్తున్నారు. మరో మంత్రి పదవి బొబ్బిలి లేదా విజయనగరం రాజులకు కేటాయిస్తారా? బిసిలకు కేటాయిస్తారా? అన్నది మరో చర్చ. ఈ లెక్కన బిసిలకు కేటాయిస్తే గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాసరావు, లేదా చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావుకు దక్కే అవకాశాలు ఉన్నాయన్న చర్చ నడుస్తోంది. వెంకటరావు సీనియర్ అయినప్పటికీ ఈసారి రాష్ట్ర వ్యాప్తంగా యువతను ప్రోత్సహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ లెక్కన శ్రీనివాసరావుకు అవకాశం దక్కవచ్చనే ఊహాగానాలు వ్యక్తమౌతున్నాయి. లేదా సీనియర్ల అవసరం తప్పనిసరి అనిభావిస్తే కిమిడికి మరోసారి మంత్రి పదవి దక్కే అవకాశాలు లేకపోలేదు. టిడిపి ఏర్పడిన ప్రతిసారీ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ జగపతిరాజు తప్పక మంత్రి అయ్యే వారు. ఈసారి ఆయన పోటీలో లేకపోవడం వల్ల ఎస్‌టి, బిసిలకు పదవులు దక్కవచ్చనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. ఒక వేళ రాజకీయ చరిష్మా, నాయకత్వ వారసత్వానికి ప్రాధాన్యత ఇస్తే బొబ్బిలి లేదా విజయనగరం రాజులు (బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, అదితి విజయలక్ష్మి గజపతిరాజు)లో ఎవరో ఒకరికి ఇస్తారనేది మరోవైపు చర్చ నడుస్తోంది. మరోవైపు సామాజిక కోణంలో రాజాం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ కూడా మంత్రి పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి యువతను ఎక్కువగా ప్రోత్సహించింది. ముఖ్యంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ కూడా భవిష్యత్తు రాజకీయాల దృష్ట్యా యూత్‌కు ఎక్కువగా అవకాశం కల్పించారు. అందులో భాగంగానే మన జిల్లాలోని కొండపల్లి శ్రీనివాస్‌కు ఎమ్మెల్యేగా సీటు కేటాయించారు.

సుఖప్రసవాలకు భరోసా కల్పించాలి

కేంద్ర కమిటీ డిఒపిటి సభ్యులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన గర్భిణులు సుఖప్రసవాలకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వం డిఒపిటి సభ్యులు మోలాయ్ శామ్యూల్, సుదర్శన్ భగత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రిజం- 10 ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన వీరు తమ పర్యటనలో భాగంగా ఆదివారం గుమ్మలక్ష్మీపురంలోని వైటీసీలో ఉంటున్న గిరిశిఖర గర్భిణుల వసతి గృహాన్ని పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రిజం-10 అమలు ఆవశ్యకత, పురోగతి విధానాలను వివరించారు. గిరిజన గ్రామాల్లో రక్తహీనతతో బాధపడుతున్న పలువురు గిరిజన మహిళలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరి శిఖర గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తే సుఖప్రసవాలకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన గర్భిణులకు ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని అభినందించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ముఖ్యంగా 10 ఏళ్లలోపు వయసు కలిగిన చిన్నారులు పౌష్టికాహార లోపంతో మృత్యువాత పడకూడదన్నారు. అనంతరం ఈ బృందం సభ్యులు వైటిసిలో గిరిజన గర్భిణులకు వండుతున్న ఆహార పదార్థాలను రుచి చూసి మరింత మెరుగైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించి స్టాక్ రూమును పరిశీలించారు. అనంతరం మండ, రేగిడి గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో భద్రగిరి, కురుపాం ఐసిడిఎస్ సిడిపిఒలు సిహెచ్. సుశీల దేవి, కె.విజయ్ గౌరి తదితరులు పాల్గొన్నారు.



గిరిజన గర్భిణులకు సీమంతాలు చేస్తున్న కేంద్రకమిటీ సభ్యులు సుదర్శనభగత్, సిడిపిఒలు

ఉపాధి బిల్లులు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

రెండేళ్ల క్రితం చేసిన ఉపాధి పనులకు బిల్లులు చెల్లించలేదని, అప్పటి నుండి ఇప్పటి వరకు పనులు ఇవ్వనందుకు నిరసనగా సిఐటియు, గిరిజన సంఘం ఆధ్వర్యాన మండలంలోని పాంచాలి పంచాయతీ సీతంపేటలో చింతజోరు చెరువు వద్ద గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీతంపేట గిరిజనులు డుంబిరి లచ్చయ్య, సాంబయ్య, రోడ్ జర్నీ, సోమయ్య, గంగరాజు, తవిటియ్య మాట్లాడుతూ రెండేళ్లు అయినా తమ గ్రామానికి ఉపాధి పనులు ఇవ్వలేదని, ఒక్కసారి కూడా ఫీల్డ్ అసిస్టెంట్ తమ గ్రామానికి రాలేదని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల రెండేళ్ల క్రితం ముఖ్యచింత జోరు చెరువు, బొడ్డమాను జోరు చెరువు పనుల్లో దాదాపు నాలుగు వారాలు తమ గ్రామంలోని గిరిజనులమంతా పనిచేశామని, అయినా నేటికీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ విషయమై అధికారులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ నిర్లక్ష్యం వల్ల తమకు పనులు లేకపోవడంతో పస్తులతో ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడిందని, ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు ఇచ్చి తమను ఆదుకోవాలని, తమకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికుల వలస నివారణకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకమైనఉపాధి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, దీన్ని సక్రమంగా అమలు చేసే బాధ్యత అధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2005లో వామపక్షాల కృషి ఫలితంగా వచ్చిన ఉపాధి చట్టాన్ని కేంద్రం ఒకపక్క నిర్వీర్యం చేస్తుంటే కొంతమంది అసమర్థ అధికారుల నిర్లక్ష్యం వల్ల గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పనులు సక్రమంగా అమలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇకనైనా ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మసస్యపై త్వరలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు పాల్గొన్నారు.



చెరువు పనుల వద్ద నిరసన తెలుపుతున్న వేతనదారులు



ఎం.రిషివర్ధన్
4వ ర్యాంకు (ఒబిసి)



డి.శ్రీనిధి
43వ ర్యాంకు (ఒబిసి)



ఎ.హేమంత్
75 వ ర్యాంకు (ఒబిసి)



ఎం.హర్షవర్ధన్
115వ ర్యాంకు (ఒబిసి)

జెఇఇలో సత్తాచాటారు

జిల్లా విద్యార్థులకు మెరుగైన ర్యాంకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో విజయనగరం జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. దత్తిరాజేరు మండలం గదబవలసకు చెందిన మజ్జి రిషివర్థన్ ఆలిండియా స్థాయిలో జనరల్ కేటగిరీలో 59వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో నాలుగో ర్యాంకు సాధించాడు. రిషివర్థన్ తండ్రి తిరుపతిరావు గజపతినగరం మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. తల్లి సంతోషికుమారి గృహిణి. రిషివర్థన్ విశాఖలోని నారాయణ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యశించాడు.

నగరంలో శ్రీచైతన్య విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల్లో డి.శ్రీనిధి జాతీయ స్థాయిలో 326వ ర్యాంకు రాగా, ంంంఒబిసి కేటగిరిలో 43 ర్యాంకు, బి.సందీప్ శంకర్ 1238 ర్యాంకు, ఎన్.ఈశ్వర్ అక్షయ 1787 ర్యాంకు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అల్లు హేమంత్‌కుకు 521వ ర్యాంకు

విజయనగరానికి చెందిన అల్లు హేమంత్‌కు జాతీయ స్థాయిలో 521వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కేటగిరీలో 75వ ర్యాంకు పొందాడు. తెలంగాణ ఎంసెట్‌లో హేమంత్ 20వ ర్యాంకు సాధించడం గమనార్హం. హేమంత్ తండ్రి ఎవిఎస్ నాయుడు నగరంలో కలాం కళాశాల డైరెక్టర్‌కాగా, తల్లి రాజేశ్వరి ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు.

హర్షవర్థన్‌కు 780వ ర్యాంకు

రేగిడి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మొయ్యి హర్షవర్థన్ జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షలలో ఆలిండియా స్థాయిలో 780వ ర్యాంకు సాధించాడు. ఒబిసి కోటాలో 115 ర్యాంకు పొందాడు. హర్షవర్థన్ తల్లిదండ్రులు మొయ్యి జనార్దన్‌రావు, రాజ్యలక్ష్మి ఉపాధ్యాయులు.

అభివన్‌కు 5564వ ర్యాంకు

బొబ్బిలి పట్టణానికి చెందిన గంట గురుదత్త అభినవ్ జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. జాతీయ స్థాయిలో 5564వ ర్యాంకు, ఒబిసి కేటగిరీలో 1094వ ర్యాంకు సాధించాడు. అభినవ్ విజయవాడలోని ఒక ప్రయివేట్ పాఠశాలలో ఇంటర్ పూర్తి చేశాడు.

పవన్‌కు 153వ ర్యాంకు

వీరఘట్టం : పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం నడుకూరుకు చెందిన గొర్లె పవన్‌కుమార్ ఆదివారం విడుదలైన జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడు. ఓపెన్ కేటగిరిలో 1004, ఒబిసి కేటగిరిలో 153 వ ర్యాంకు సాధించాడు. విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. పవన్ మెరుగైన ర్యాంకు సాధించడం పట్ల కళాశాల డిజిఎం హనుమంతురావు, ఎజిఎం రాజబాబు, ఇన్చార్జి కిషోర్ అభినందనలు తెలిపారు.

యశస్వినికి 950వ ర్యాంకు

మండలంలోని రేగులపాడు గ్రామానికి చెందిన మెరుగుల యశస్వి జెఇఇ అడ్వాన్స్‌లో ప్రతిభ కనబరిచింది. ఆలిండియాలో 4923 ర్యాంకు ఒబిసిలో 950 ర్యాంకు సాధించింది. పదో తరగతి విజయవాడ శ్రీచైతన్య, ఇంటర్ విశాఖపట్నంలోని శ్రీ విశ్వ కళాశాలలో పూర్తిచేసింది. నేడు ఈ ఫలితాల్లో చత్తా చాటింది. తల్లిదండ్రులు రవికుమార్, చందన ఇరువురు ఉపాధ్యాయులే ఈమె విజయం సాధించడంతో పలువురు అభినందనలు తెలిపారు.



గొర్లె పవన్‌కుమార్
153 వ ర్యాంకు (ఒబిసి)



మెరుగుల యశస్వి
950వ ర్యాంకు (ఒబిసి)



బి.సందీప్ శంకర్
1238వ ర్యాంకు (ఒబిసి)



ఎన్.ఈశ్వర్ అక్షయ్
1787వ ర్యాంకు (ఒబిసి)



జి.జి.అభినవ్
1094 ర్యాంకు (ఒబిసి)

ఎస్‌జిఎఫ్ కార్యదర్శి పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం : జిల్లాలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ పోస్టుకు అర్హత, ఆసక్తి ఉన్న స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఫిజికల్ డైరెక్టర్లు) పోస్ట్‌లో పని చేయుచున్న వారు దరఖాస్తులు చేసుకోవచ్చుని డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ / జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న పీడీలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. స్కూల్ గేమ్స్ సెక్రటరీగా రెండేళ్ల పదవీ కాలం ఉంటుందని చెప్పారు. ఈ నెల 22లోగా ప్రధానోపాధ్యాయులు, ఉప విద్యాశాఖాధికారి కౌంటర్ సైన్‌తో దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని సూచించారు.



ఏజెన్సీలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఒకవైపు ఏనుగులు... మరోవైపు కుక్కలు

ఆందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలో గత కొన్నేళ్లుగా అడవి ఏనుగుల గుంపు సంచారంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతుంటే వీటికి తోడు ఇటీవల కాలంలో గ్రామాల్లో కుక్కలు తిరుగుతూ ప్రజల ప్రాణాలను తీస్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి అడవి ఏనుగులను తరలించాలని ప్రజలు కోరుతుంటే ఆ సమస్య పరిష్కారం కాకముందే మరోవైపు కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మన్యం జిల్లాలో ఏనుగుల దాడిలో ఇప్పటి వరకు 15 మంది వరకు మృత్యువాత పడ్డారు. కుక్కల దాడిలో జియమ్మ వలస మండలంలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఒక వ్యక్తి తీవ్ర గాయాల పాలవ్వగా, మరికొంతమంది గాయాల నుంచి బయపట్టారు. భామిని, కురుపాం, జియమ్మ వలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల్లో అడవి ఏనుగులు పంటలను నాశనం చేస్తూ రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో కుక్కల సంచారంతో ప్రజలు ఒంటరిగా వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. జిల్లాలో కుక్క కాటు బాధితులు పెద్ద సంఖ్యలోని ఆసుపత్రులకు వస్తున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా పై రెండు సమస్యలపై దృష్టి సారించి పరిష్కారం చూపి ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న వీధి కుక్కలు

కలగా మిగిలిన మినీ రిజర్వాయర్

- రూ.4 కోట్లతో అంచనాతో ప్రతిపాదన
- పరిశీలనకే పరిమితం
- బీడు భూములుగా మారుతున్న పంట భూములు
- సాగునీరు ప్రశ్నార్థకం
- పట్టించుకోని పాలకులు

ప్రజాశక్తి - వీరఘట్టం

చిన్న నీటి వనరులు... పేరులోనే చిన్న ఉన్నప్పటికీ... వాటిని స్వదినియోగం చేసుకుంటే భారీగా ప్రయోజనాలు పొందవచ్చు. భూసేకరణ, అటవీ పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా తక్కువ సమయం అతి తక్కువ వ్యయంతో సులువుగా నిర్వహణ చేసుకోవడానికి వీలున్న చిన్ననీటి వనరులే కానీ వాటిపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం కొనసాగిస్తుంది. మండలంలోని కె.ఇచ్చాపురం పంచాయతీ పరిధిలో ఈతకొండ-ఎండ కొండ గిరిజన గ్రామాల మధ్య మినీ రిజర్వాయర్ సుమారు రూ.నాలుగు కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు అప్పట్లో పరిశీలన చేశారు. ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ పనులు ప్రారంభించకపోవడంతో 2వేల ఎకరాలకు సాగునీటికి ప్రశ్నార్థకంగా మారింది. వీరఘట్టం మేజర్ పంచాయతీ పరిధిలోని అచ్చుపువలస గిరిజన గ్రామం నుండి సీతంపేట మండలం బర్న గిరిజన గ్రామం వరకు కొండ పక్కన ఉన్న భూములకు మినీ రిజర్వాయర్ పూర్తయితే అక్కడ భూములన్నీ సస్యశ్యామలమవుతాయి. ఏడాదికి రెండు పంటలు కూడా పండించుకోవచ్చునని నాలుగు దశబ్దాల పైబడి ఇక్కడ మినీ రిజర్వాయర్ నిర్మించేందుకు అప్పట్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిమిత్తం విశాఖపట్నంకు పంపించారు. ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ పనులు చేపట్టకపోవడంతో పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోటార్లతోనే సాగు

ప్రస్తుత కాలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పంటలకు నీరు సరిపోకపోవడంతో చేసేదేమీ లేక అవకాశమున్న రైతులు తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా వస్తున్న సాగునీటిను మోటార్ల సహాయంతో పొలాలకు మళ్లించి పంటను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవకాశం లేని రైతులు వర్షాలపై ఆధారపడి పంటల సాగు చేస్తున్నప్పటికీ కళ్లముందే పంటలు నాశనం కావడంతో పంటపై పెట్టిన పెట్టుబడులు ఎలా తీర్చాలంటూ నీలంపేట, గదబవలస, హుస్సేనపురం, వంకాయలగెడ్డ తదితర గ్రామాలకు చెందిన కె.సరోజిని, నారాయణపురం నీలం శెట్టి, వాసు, భోగమ్మ, పి.గౌరమ్మ, సుందరమ్మ, పుష్ప, టి.శాంతమ్మ, సావిత్రమ్మ, ఆర్.తాతబాబు, దాలమ్మ, జి.పెద్ద సీతయ్య తదితర అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటకు సాగు నీరందక చేతికి అంది వచ్చి తరుణంలో కళ్ల ముందే పంటలు ఎండిపోవడంతో వాటిని చూసిన అన్నదాతలు కంటతడి పెట్టారు. రైతులను రాజులుగా చేస్తామని పాలకులు ఉపన్యాసాలకే పరిమితమవుతున్నారే తప్ప రైతులకు కనీస అవసరమై సాగునీటి సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఈ ప్రాంత అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు అన్నదాతలను దృష్టిలో పెట్టుకుని సాగునీటి వనరులు నిర్మించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత అన్నదాతలు కోరుతున్నారు.



వర్షాలు లేక ఎండిన వరి పంటలు (ఫైల్)



మినీ రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రాంతం ఇదే



ఎంపి అప్పలనాయుడును కలిసిన నాయుడు దంపతులు

కలిశెట్టిని కలిసిన సిఎల్ నాయుడు దంపతులు

ప్రజాశక్తి - పాలకొండ

సిఎల్ విద్యాసంస్థలు అధిపతి, మాజీ ఎపిజివిబి డైరెక్టర్ సిఎల్ నాయుడు, ఆయన భార్య, మాజీ సర్పంచ్ చొంగ రమాదేవి విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అప్పలనాయుడు ఎంపి పదవి వరించడం తమకెంతో సంతోషంగా ఉందని , మీ ద్వారా మరింత మంచి పనులు జరగాలని ఆకాంక్షించారు.



గిరిజకు ఆర్థికసాయం అందజేస్తున్న నాటి పదో తరగతి సహచరులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టం మహాత్మాగాంధీ 3 రోడ్ల జంక్షన్ నివాసముంటున్న మహాపాత్రో గిరిజకు బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం సహచార విద్యార్థులు గిరిజ ఇంటికి వెళ్లి పరామర్శించి, కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గిరిజ భర్త గౌరీపతికి అనారోగ్యం కారణంగా వైద్య ఖర్చులు నిమిత్తం ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.57,500 వైద్య ఖర్చులు నిమిత్తం నగదు అందజేశారు. ఇటీవల తన కుమారుడు కూడా మరణించడంతో పూర్వ విద్యార్థులు ఆమె పరిస్థితిని తెలుసుకొని చలించి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. 1990 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఒక వాట్సాప్ గ్రూపుగా ఎంపిక చేసుకొని, ఆపద ఉన్న కుటుంబానికి బ్యాచ్ అంతా సంఘటితంగా ఆదుకొని తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇలాగే ఈ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పేదలను కూడా ఆదుకునేందుకు ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉందని పలువురు మనలు పొందారు.



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

ఉల్లాసంగా... ఉత్సాహంగా

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడపారు. ఆదివారం సెలవు దినం కావడం, అందులోనూ వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పార్కు పోటెత్తింది. పార్కులో ఉన్న అందాలను ఆశ్వాదించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా పర్యాటకులు తరలివచ్చారు. జలవిహార్ వద్ద హాయి హాయిగా బోటు షికారు చేశారు. ఆనంద్ విహార్ వద్ద ఉల్లాసంగా, ఉత్సాహంగా డాన్సులు వేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. స్కై సైకిల్ ఎక్కి ఆకాశంలో చక్కర్లు కొట్టారు. చిన్నారులు చిల్డ్రన్ పార్కు వద్ద సరదాగా ఆడుకున్నారు. చిన్నారులు మినీ బోటింగ్ మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద కేరింతల కొడుతూ జరగాలాడారు



తిరుపతినాయుడును పరామర్శిస్తున్న మాజీ మంత్రి రాజన్నదొర

తిరుపతినాయుడికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు రెడ్డి తిరుపతి నాయుడును మాజీ మంత్రి రాజన్నదొర ఆదివారం పరామర్శించారు. మండలంలోని బాగువలసలో తిరుపతినాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. గత కొంతకాలంగా తిరుపతినాయుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ వున్నారు.

మాయమైన హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని పూతికవలస, కస్పాగదబవలస, శివ్వన్నపేటకు సమీపంలో సర్వే నంబర్లు 427,41, 25/7 సంబంధించిన సుమారు ఐదెకరాల మేర కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి అమ్మకాలు జరపడంతో గత నెల 23న ఆ స్థలాల వద్ద పంచాయతీ, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. అనుమతులు తీసుకోవాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఇంతవరకు పంచాయతీ నుంచి, బుడా వారి వద్ద అనుమతులు పొందలేనప్పటికీ కొందరు అధికారులకు స్థిరాస్తి వ్యాపారులు కానుకలు అందజేయడంతో బోర్డులు పెట్టిన రెండు రోజులేకే మాయం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా అది బ్లానర్‌తో ఏర్పాటు చేసినా ఆ బోర్డు ఏమైందో తెలియదని తెలిపారు. మళ్లీ సోమవారం నోటీసులు ఇచ్చి అప్పటికి స్పందించకపోతే పర్మినెంట్ బోర్డు ఏర్పాటు చేస్తామని అన్నారు.



గతంలో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఈ ఏడాదైనా శుద్ధ జలాలు అందేనా?

బురద నీరు సరఫరాయేనా!

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మున్సిపాలిటీ పరిధిలో గల పట్టణ ప్రజలకు గత 15ఏళ్లుగా వర్షాకాలంలో కుళాయిల ద్వారా ప్రతి ఏటా బురద నీరు సరఫరా జరుగుతోంది. ఈ నీటినే వాడుకొనే పరిస్థితి పట్టణ ప్రజలకు తప్పడం లేదు. ఈ వర్షాకాలంలోనైనా శుద్ధ జలాలు సరఫరా జరిగేనా, బురద నీరు సరఫరా తప్పదా అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇటీవల విజయవాడ నగరంలో కుళాయిల ద్వారా జరిగిన కలుషితనీరు తాగి కొందరు మరణించారు. అలాంటి సంఘటన పార్వతీపురంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ఈ బురద నీటి సమస్య పరిష్కారానికి మున్సిపల్ అధికారులు ప్రతి ఏటా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో ఏమాత్రం మార్పు కనబడలేదని చెప్పవచ్చు. ఈ ఏడాది మరికొన్ని రోజుల్లో వర్షాకాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా జరిగే అవకాశం ఉంటుదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పార్వతీపురం నియోజకవర్గం నుంచి కొత్తగా గెలిచిన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపి మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, పట్టణంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలైన డంపింగ్ యార్డ్ తరలింపు సమస్యతో పాటు, రానున్న వర్షాకాలంలో బురద నీరు సరఫరా జరగకుండా ప్రణాళికలు రూపొందించాల్సిన బాధ్యత, చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కుళాయిల ద్వారా వస్తున్న బురదనీరు

ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు
పోటా పోటీ ప్రచారం

ప్రజాశక్తి - వీరఘట్టం

మరికొద్ది రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను తమ పాఠశాలల్లో చేరాలని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పోటీ పోటీ ప్రచారం మండలం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేసుకునేందుకు వీలుగా పాఠశాలల సిబ్బంది విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరుతున్నారు. అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ప్రభుత్వ పథకాలతో పాటు ఉచితంగా పుస్తకాలు మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు లభిస్తాయని చెబుతున్నారు. అలాగే మెరుగైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో పిల్లలు ఉండేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. మీ పిల్లల భవిష్యత్తు మా చేతిలో ఉందని, ఒకసారి ఆలోచించి పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను సిబ్బంది వేడుకుంటున్నారు. మీ పిల్లలు భవిష్యత్తు బాగుండాలన్నా మీకు మంచి పేరు రావాలన్నా మీ చేతిలో ఉంది గనుక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు ముందుకు రావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. మరోవైపున మీ పిల్లలు బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలంటే మా పాఠశాలలో చేర్పించాలంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులను కోరుతున్నాయి. ఇలా ఎవరికి వారు తమ పాఠశాలల గొప్పతనం గురించి చెబుతుంటే పిల్లలను ఏ పాఠశాలల్లో చేర్పించాలని అర్థంకాని పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్నారు.

భూదేవి ఎక్కడ?

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూదేవి ఎక్కడ ఉన్నారు అనేది ఆ పార్టీ నాయకులకు కూడా తెలియని పరిస్థితి నెలకొంది. మొదటి నుండి పాలకొండ ఎమ్మెల్యే టికెట్ ఆశించిన పడాల భూదేవి ప్రస్తుత ఎమ్మెల్యే జయకృష్ణతో సీటు కోసం పోటీ పడ్డారు. టిడిపి టికెట్ కావాలంటూ కొంతమంది నేతలతో కలిసి గట్టిగానే ప్రయత్నించారు. అయితే జయకృష్ణ అప్పటికే ప్రజల్లో గట్టి పట్టు సంపాదించడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో కూడా దూసుకుపోతుండడంతో టికెట్ విషయంలో ఆమెకు ఆశాభంగం ఎదురైంది. పొత్తుల్లో భాగంగా పాలకొండ టికెట్ జనసేనకు కేటాయించడంతో ఆమె జనసేనలో చేరి టికెట్ ఆశించారు. అక్కడ కూడా ఆమెకు భంగపాటు ఎదురైంది. జయకృష్ణకే టికెట్ కేటాయించడంతో వెంటనే జనసేనకు రాజీనామా చేసి మళ్లీ టిడిపి గూటికి చేరారు. టిడిపిలో చేరాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన ఆమెను జయకష్ణతో కలిసి పని చేయాలని అధిష్టానం చేసిన ఆదేశాలను కూడా ఈమె పెడచెవిన పెట్టి, జయకృష్ణకు వ్యతిరేకంగా పని చేశారని ప్రజల్లో అపవాదం మూటకట్టుకున్నారు. జయకష్ణ గెలిచిన తర్వాత పొత్తుల్లో ఉన్న ఆమె కనీసం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు కూడా తెలియజేయలేదు. అలాగే జయకృష్ణ గెలుపు తర్వాత నియోజకవర్గంలో ఈమె ఎక్కడా కనిపించకపోవడం ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

చెత్త నుండి సంపద సృష్టించి వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగపడుతుందని ఆశయంతో గత ప్రభుత్వం చెత్త సంపద కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. అధికారుల అలసత్వంతో వీటిపై ప్రత్యేక దృష్టి సారించకపోవడం వల్ల అవి మూలకు చేరి నిరుపయోగంగా పడి ఉన్నాయి. మండలంలోని 34 పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చెత్త సంపద కేంద్రాలు నిర్మించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ ఇక్కడి అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడా పూర్తిస్థాయిలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టలేదని స్థానికుల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి.

15 గ్రామాలకే పరిమితం

మండల కేంద్రంతో పాటు దశమంతపురం, నడిమికెల్లా, తలవరం, పనసనందివాడ, కిమ్మి, తెట్టంగి, బిటివాడ, కత్తులకవిటి, రేగులపాడు తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేసి వీటి నిర్వహణకు షెడ్ మిత్రులు, క్లాప్ మిత్రులు ప్రభుత్వం నియమించి వీరికి స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. వీరు గ్రామంలోని చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలిస్తారు.

ఆదాయం పోతుంది

మండలంలోని గడగమ్మ, చలివేంద్రి, నడుకూరు, చిట్టపూడివలస, యు.వెంకంపేట, కొట్టుగుమ్మడ, కుమ్మరిగుంట, ఎంవిపురం, పివిఆర్ పురం, కంబరవలస, ఎం.రాజపురం, చిన్నగారకాలనీ, కె.ఇచ్చాపురం తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించకపోవడంతో సేకరించిన చెత్త వేరే చోటకు తరలించడంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయం పోతుందని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఆశయానికి గండి కొడుతుందన్నందుకు ఇది నిదర్శనమని చెప్పవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్థాంతరంగా నిలిచిపోయిన చెత్త సంపద కేంద్రాలు నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం వద్ద ప్రజాశక్తి ప్రస్తావించగా పరిశీలన జరిపి నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తలవరం వద్ద నిరుపయోగంగా ఉన్న చెత్త సంపదన కేంద్రం

అక్షర యోధుడు రామోజీరావు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఈనాడు మీడియా గ్రూప్ సంస్థల చైర్మన్, పాత్రికేయ దిగ్గజం చెరుకూరి రామోజీరావు మతి పట్ల ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు పత్రికా రంగంలో ఒక ప్రత్యేక ఒరవడితో దినపత్రికను నడిపిన ఘనత రామోజీరావుకు దక్కుతుందన్నారు. ఈనాడు జర్నలిజం స్కూల్ ద్వారా ఎంతోమందికి శిక్షణ పొంది జర్నలిస్టులుగా నేడు తయారయ్యారన్నారు. ముఖ్యంగా సామాజిక బాధ్యతతో పత్రికా విలువలు పాటించి సమాజానికి మేలు కలిగించే సంపాదకీయాలు ఈనాడు సొంతమన్నారు. పత్రికా రంగంతో పాటు ఈటివి, చలన చిత్ర రంగంలో రామోజీరావు దేశవ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతులు సంపాదించారని కొనియాడారు. రామోజీరావు మరణం పత్రికా రంగానికి తీరని లోటని అభివర్ణించారు.

టిడిపి కార్యాలయంలో...

స్థానిక పట్టణ టిడిపి కార్యాలయంలో రామోజీరావు చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట్ నాయుడు, సీనియర్ నాయకులు బర్నాల సీతారామారావు, పట్టణ కౌన్సిలర్లు కోల మధుసూదన్‌రావు, కోరాడ నారాయణరావు, పట్టణ అధ్యక్షులు గుంట్రెడ్డి రవికుమార్, తెలుగు యువత అధ్యక్షులు పాలకొండ రాజశేఖర్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పాచిపెంట : తెలుగు పత్రిక రంగానికి మచ్చుతునకగా ఎనలేని కృషి చేసిన వ్యక్తి రామోజీరావు అని ఆయన మతి పత్రికా రంగానికి తీరని లోటని పాచిపెంట మండలం ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.



సీతానగరంలో రామోజీరావుకు నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

సీతానగరం: మండల టిడిపి నాయకులు సాల హరిగోపాల్ రావు ఇంటివద్ద రామోజీరావుకు నాయకులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.వేణుగోపాలనాయుడు, పి.సత్యంనాయుడు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.అరవింద్ కుమార్, దామినేని పెద్దబ్బాయి, మాజీ ఎంపిటిసి సభాను శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బిబి శ్రీనివాసరావు, బి.శంకర్రావు, తెంటు రామారావు, వాకాడ పారినాయుడు, బొమ్మలేని లక్షణరావు, కొట్టాల రామకృష్ణ, యోగిరెడ్డి భాస్కరరావుతో పటు పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు
పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు కట్టుకున్న లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించి అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం, గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో నాయకులు కొల్లి సాంబమూర్తి, ఆర్.శివున్నాయుడు, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ 2018, 19లో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉండే సందర్భంగా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పేదలందరికీ ఇళ్లు మంజూరు చేశారన్నారు. అనంతరం వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీ కింద మండలంలో 2400 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయగా, కేవలం 1250 మందికి మాత్రమే ఇళ్లు కట్టుకున్నారు. ఇంకా వివిధ రకాల కింద 1150 మంది లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేదు. అయితే నిర్మాణాలు ప్రారంభించిన 1210 మందికి నేటికీ బిల్లులు చెల్లించలేదు. కావున మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చినందున గతంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు కట్టుకోలేని వారిని గుర్తించి బిల్లులు చెల్లించి వారికి భరోసా కల్పించాలని కోరారు.

నేరాలు ఘోరాలు

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని కృష్ణపల్లి పంచాయతీ చెరువుగట్టు కాలనీకి సంబంధించిన చింతాడ కుమారి (42) వివాహిత శుక్రవారం రాత్రి తల్లి మందలించిందని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా ఆదివారం ఆమె మృతి చెందినట్లు రూరల్ ఎస్సై దినకర్ తెలిపాశారు. ఆమెకు వివాహమైనా భర్త లేనప్పటికీ ఒక కుమారుడితో తన తల్లి ఇంట్లో నివసిస్తుంది.



మృతి చెందిన కుమారి

పేకాట శిబిరంపై దాడి నగదు స్వాధీనం

మండలంలోని లక్ష్మీనారాయణపురం సమీపంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్సై దినకర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రూ.1,2535 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగుర్ని అదుపులో తీసుకున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా ; ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని సప్పగూడగ్రామ సమీపంలో ప్రధాన రహదారి వద్ద ఆటో బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలయ్యాయి. గోరటి గ్రామంలో జరిగిన వివాహానికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా లప్పటి గ్రామానికి చెందిన గిరిజనులు. స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



బోల్తాపడిన ఆటో

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని జాతీయ రహదారిపై అమనం వంతెన సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడ్డేపు వెంకటేష్ (33) మృతి చెందాడు. వెంకటేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా హైదరబాదులో పనిచేస్తున్నాడు. ఇటీవలి మొదడకు సంబంధించిన ఆపరేషన్ జరిగింది. తన కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నం నుంచి కారులో ఇంటికి వెళ్తున్నారు. అమనం వంతెన వద్ద బహిర్భూమి కోసం రోడ్డు దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న భార్య శ్రీలేఖతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై ఆయన తండ్రి సహదేవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

అ'పూర్వ' కలయిక
44 ఏళ్ల నాటి విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 44 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులంతా సాలూరు చేరుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడిన వారంతా ఒక చోట చేరి చిన్ననాటి మధుర స్మతులను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సమ్మేళనానికి తెలంగాణ, ఏపి రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన వారంతా 170 మంది పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న సమయంలో చేసిన అల్లరి చేష్టలు, గురువులు చెప్పిన బోధనలను గుర్తుకు తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో పట్టణానికి చెందిన ఉప్పాడ రవిప్రకాష్ విశాఖపట్నంలో ఎసిబి ఎస్పీగా పని చేస్తున్నారు. మరో విద్యార్థి సయ్యద్ అన్వర్ పాషా కెనడా నుంచి ఇక్కడి కి వచ్చారు. అనంతరం అప్పుడు చదువు చెప్పిన గురువులు శ్రీరామ్మూర్తి, గోపాలరావు, వైకుంఠం గాంధీ, జార్జి ఎబినైజర్, సత్యనారాయణ, మృత్యుంజయ రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులుగా ఎసిబి ఎస్పీ ఉప్పాడ రవిప్రకాష్, గర్భాపు నాగేశ్వరరావు, బాలి విశ్వేశ్వర రావు వ్యవహరించారు.



సాలూరులో ఒకే చోటకు చేరిన స్నేహితులు

పూర్వపు విద్యార్థులు అపూర్వ కలయిక

సీతంపేట : మండలంలో పదో తరగతి -2000 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల కలయిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగింది. ఈ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా కలిసి పాత తమ జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. చిన్నతనంలో వాతావరణం, ఆ బడులు చూడగానే టక్కుమని గుర్తుకొచ్చాయి. ఏ విద్యార్థులు ఏం చేస్తున్నారో చెప్పుకొని సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి హెచ్ఎం లలితాంబా, అమ్మరావు, గోవిందరావు, లక్ష్మణరావు, పాణి, శేఖర్, నాగేశ్వరరావు, కుల శేఖర్ దాసు, కృష్ణమోహన్, శివరాం ప్రసాద్, పాణిగ్రహిను విద్యార్థులు శాలువా సత్కరించి, సన్మానించారు. కార్యక్రమంలో 115 విద్యార్థులకు గానూ 80 మంది హాజరయ్యారు.

24వ రోజుకు జిందాల్ సమ్మె

ప్రజాశక్తి - కొత్తవలస

జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 24వ రోజుకు చేరింది. జిందాల్ కర్మగారాన్ని యాజమాన్యం బెషరతుగా తెరిపించి కార్మికులందరికీ పని కల్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. 24 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా యాజమాన్యానికి చీమ కుట్టినట్లైనా లేదని కార్మికు ఆందోళన వ్యక్తం చేశారు. తమ బతుకులు చిన్నాభిన్నమైనప్పటికీ యాజమాన్యం చోద్యం చూస్తుందని ఆరోపించారు. జిందాల్ కార్మికులకు ఎటువంటి సమాచారమూ లేకుండా యాజమాన్యం కార్మికులను రోడ్డుపైకి నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడం ఏంటని ప్రశ్నించారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలన్నారు.

అధికారుల పర్యవేక్షణలో బిటి రహదారి పనులు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నుంచి మండ గ్రామ ప్రధాన బిటి రహదారి వరకు జరుగుతున్న బిటి మరమ్మతు పనులను ఆదివారం సాయంత్రం ఆర్అండ్‌బి అధికారులు సుశీల, నిర్మల దగ్గరుండి పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటీ రహదారి మరమ్మతు పనుల నిమిత్తం సిఎంఒ నిధుల నుంచి రూ.3 కోట్ల 80 లక్షలు నిధులు మంజూరయ్యాయని, ఎక్క డా నాణ్యతా లోపాలు లేకుండా దగ్గరుండి పర్యవేక్షిస్తూ పనులు చేయిస్తున్నారు.

గజపతినగరంలో భారీ చోరీ

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరంలో శనివారం రాత్రి దొంగతనం జరిగిందని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గరలో నివాసముంటున్న బొడ్డేట తిరుపతి అనే వ్యక్తి తీర్థయాత్రల కోసం శనివారం బయటకు వెళ్లగా అతని మేనమామ నాగరాజుకు ఇంటి బాధ్యత అప్పజెప్పాడు. ఆదివారం ఇంటికి వెళ్లి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చిన నాగరాజు లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి, బీరువాలు బద్దలు కొట్టే ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 25 తులాల బంగారం, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.